# సాక్షి అనంతపురం

శనివారం । 27 । జూలై । 2024






## చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



## మృత్యువులోనూ వీడని బంధం

అతనికి అమ్మంటే ఎనలేని ప్రేమ. ఆమెకు కొడుకంటే ప్రాణం. విధి చిన్నచూపు చూడటంతో ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. బెంగతో కుమారుడు ప్రాణం విడిచాడు. 8లో

గరిష్టం/కనిష్టం
34.2°/23.4°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 18 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### 27, 29, 31 తేదీల్లో వర్షాలు



**బుక్కరాయసముద్రం:** జిల్లాలో ఈ నెల 27, 29, 31 తేదీల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### 31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

**అనంతపురం:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న డిప్లొమా సీట్లను ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. వివిధ కేటగిరిల్లో 24 సీట్లు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఖాళీగా ఉన్న 21 సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు స్వీకరిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరే విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు అర్హులు కారని స్పష్టం చేశారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని రావాలని, అదే రోజే పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని కేటగిరీల వారికి సుమారుగా రూ.6 వేలు ఫీజు ఉంటుందన్నారు. మొదటి ప్రాధాన్యత పాలిసెట్-2024లో అర్హత సాధించిన వారికి సీట్లు కేటాయిస్తామన్నారు.

### ఐటీఐ అడ్మిషన్లకు నేడు రెండో విడత కౌన్సెలింగ్

**అనంతపురం ఎడ్యుకేషన్:** జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ఏ ఐటీఐకు దరఖాస్తు చేసుకున్నారో అక్కడ కౌన్సెలింగ్‌కు పాల్గొనాలని అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కులం, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు.

### అనంతపురం ఇన్‌చార్జ్ ఆర్డీఓగా వసంతబాబు

**అనంతపురం రూరల్:** అనంతపురం ఆర్డీఓ గ్రంధి వెంకటేష్‌ను మంత్రి టీజీ భరత్‌కు ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన రిలీవ్ అయ్యారు. డిప్యూటీ కలెక్టర్ వసంతబాబును అనంతపురం ఇన్‌చార్జ్ ఆర్డీఓగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ బాధ్యతలు చేపట్టారు. త్వరలో రెగ్యులర్ ఆర్డీఓను నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సబ్‌స్టేషన్లనూ వదల్లేదు!

- ఇక్కడ కన్పిస్తున్న చిత్రం అనంతపురం సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం. 20 శాతం లోపే పనులు జరిగాయని అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా తక్షణమే సబ్ స్టేషన్ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీజీఎం ఆయూబ్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కన్‌స్ట్రక్షన్ విభాగం అధికారులు సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పనులు ఆగిపోయాయి.



- పనులు సరిగా చేయలేదనే నెపంతో 21 సబ్‌స్టేషన్ల నిర్మాణ కాంట్రాక్టు రద్దు
- కొత్తగా టీడీపీ వారికి కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ఎత్తుగడ

**అనంతపురం టౌన్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు కావస్తోంది. అప్పుడే అధికార టీడీపీ తమకు అనుకూలమైన వారికి కాంట్రాక్ట్ పనుల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించింది. ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 21 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులనుంచి కాంట్రాక్టర్లను తప్పించేశారు.

**జగన్ సర్కార్ హయాంలో విద్యుత్ సంస్కరణలు**

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంస్కరణలు చేపట్టింది. లో ఓల్టేజీ సమస్యతోపాటు కోతలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలతో విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 47 విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేసింది. ప్రతి విద్యుత్ డివిజన్‌కూ 8 చొప్పున సబ్ స్టేషన్లు మంజూరు చేశారు. ఒక్కో సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.5 కోట్ల చొప్పున 47 సబ్ స్టేషన్లకు రూ.118 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 26 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తవడంతో ఆయా ప్రాంతాల్లోని రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

**సబ్ స్టేషన్ల నిర్వహణ గందరగోళం**

రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో సబ్ స్టేషన్ల నిర్వహణలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత కాంట్రాక్టర్లను తప్పించడంతో పనులు ఎక్కడివక్కడే ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. రూ.4 లక్షలకు పైగా ఖర్చు అయ్యే ప్రతి పనికీ విద్యుత్ శాఖలో టెండర్ విధానం ఉంది. కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణ బాధ్యతలను కొత్తవారికి ఎలా కట్టబెడతారో వేచి చూడాల్సిందే.

> **ఉత్తర్వులు అమలు చేశాం**
>
> ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు 20 శాతంలోపు సబ్ స్టేషన్ల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లను నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకోవాలని సూచించాం. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. – **మోహనమ్మ, ఈఈ కన్‌స్ట్రక్షన్ విభాగం, ఏపీఎస్పీడీసీఎల్**

### గుంతకల్లు డివిజన్ అభివృద్ధికి సహకారం



డివిజనల్ కంట్రోల్ సెంటరును ప్రారంభిస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

**గుంతకల్లు:** గుంతకల్లు రైల్వే డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. గుంతకల్లు డివిజన్ పర్యటనలో భాగంగా శుక్రవారం గుంతకల్లుకు వచ్చిన ఆయనకు డీఆర్‌ఎం ఎం.విజయ్‌కుమార్, ఏడీఆర్‌ఎం సుధాకర్ స్వాగతం పలికారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో వివిధ విభాగాలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షించారు. దాదాపు రూ.30 కోట్లతో నూతనంగా నిర్మించిన డివిజనల్ కంట్రోల్ సెంటరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,131 కోట్లకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. కొత్త రైళ్ల ఏర్పాటుపై విలేకరులు ప్రశ్నించగా.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జోనల్ ఏజీ పటేల్, సీనియర్ డీఈఎస్ కో–ఆర్డినేషన్ జీబీఎస్ శ్రీనివాస్, సీనియర్ డీఓఎం ఎం.శ్రావణ్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఏ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఈఈ యల్లయ్య, ఆర్‌పీఎఫ్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైల్వే జీఎం గుంతకల్లు–డోన్–కర్నూలు సెక్షన్‌లో ప్రత్యేక రైల్లో ప్రయాణించి.. రైలు మార్గం పటిష్టతను పరిశీలించారు.

# పరిశ్రమల ఏర్పాటు పనులు పూర్తి చేయండి





జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, పాల్గొన్న అధికారులు



మాజీ సైనికులతో కలెక్టర్

**అనంతపురం అర్బన్:** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు సృష్టించే దిశగా తయారీ, సేవారంగ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలని చెప్పారు. సింగిల్ విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు చేసుకున్న దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో ఆమోదించాలని ఆదేశించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా రుణాలు మంజూరైన యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అనువైన భూమిని గుర్తించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకున్న టైలరింగ్, భవన కార్మికుల్లో అర్హులైన వారిని గుర్తించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమల పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు ఉత్పత్తి ప్రారంభించాలని వాటి ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం ఇండస్ట్రియల్ పాలసీ కింద 22 యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.నాగరాజారావు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆదికేశవులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ప్రమాదాల నివారణకు చర్యలు**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీటీసీ వీర్రాజుతో కలిసి రోడ్ సేఫ్టీ కమిటీ, జిల్లాస్థాయి క్లెయిమ్ సెటిల్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపైన, నేషనల్ హైవే హెల్ప్‌లైన్ నంబర్ 1033పైన అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. అనంతపురంలో 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు నివారించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఆంథోనప్ప, ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్, డీఎంహెచ్‌ఓ ఇ.బి.దేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ఈఈ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

**'కార్గిల్' వీరుల త్యాగం అసమాన్యం**

కార్గిల్ యుద్ధవీరుల త్యాగం అసమాన్యమని, వారి ధైర్యసాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్, జిల్లా సైనిక్ బోర్డు ప్రెసిడెంట్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవం సందర్భంగా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధవీరులు, మాజీ సైనికులను విజయ్ దివస్ మెమెంటోతో కలెక్టర్ సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ విధుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం పరిధి నుంచి దాదాపు 30 మందికి పైగా సైనికులు ప్రాణాలకు తెగించి పాల్గొనడం గొప్పవిషయన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, మాజీ సైనికులు కెప్టెన్ ఉమామహేశ్వరరావు, హవల్దార్ రమేష్‌కుమార్‌రెడ్డి, సార్జంట్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



సరిహద్దు వివరాలపై ఆరా తీస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

**రాయదుర్గం:** అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం రాయదుర్గం అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించిన తర్వాత సీఐలు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులుతో కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వొద్దన్నారు. నియోజకవర్గానికి కర్ణాటక సరిహద్దు ఆనుకుని ఉండడంతో పోలీసు నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. మద్యం, గంజాయి, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పేకాట, మట్కా ఎక్కడా కనిపించకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, సీఐ మురళీమోహన్ ఉన్నారు.





SRI VENKATESWARA INSTITUTE OF TECHNOLOGY
ANANTAPURAMU Web Code-SVIT
NH-44, HAMPAPURAM [V], RAPTHADU [M], ANANTAPURAMU-515722
Email : hr@svitatp.ac.in Contact: 8331047022, 9494321337
CSE, CSM, CSD, ECE CONVENER SEATS ARE AVAILABLE IN SECOND PHASE WEB COUNSELLING
ADMISSION NOTIFICATION CATEGORY-B / NRI SPONSORED SEATS
(NRI seats 15% part of cat-B seats ) in B.Tech programme-2024-25

| B.Tech | CSE | CSM | CSD | ECE | MECH | EEE | CIVIL |
|---|---|---|---|---|---|---|---|
| Intake | 180 | 90 | 60 | 90 | 30 | 30 | 30 |
| Category-B | 54 | 27 | 18 | 27 | 9 | 9 | 9 |

WANTED FACULTY
Applications are Invited from Eligible Candidates for the Faculty Positions in the Following Departments.

| DEPARTMENTS | FACULTY POSITION |
|---|---|
| CSE, CSM, CSD, ECE, MECH, EEE, CIVIL, CHEMISTRY, PHYSICS, MATHEMATICS & ENGLISH. | PROFESSORS / ASSOCIATE PROFESSORS / ASSISTANT PROFESSORS |

Application should be sent to the above mail ID.
Qualification & salary as per AICTE norms
- PRINCIPAL


# ఆగస్టు రెండో వారంలో ఆయకట్టుకు నీరు

- హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ వెల్లడి



ఆంధ్ర సరిహద్దులో హెచ్చెల్సీని పరిశీలిస్తున్న ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ రమణారెడ్డి తదితరులు

**బొమ్మనహాళ్/ కణేకల్లు:** ఆగస్టు రెండో వారంలో ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఆంధ్రా సరిహద్దులోని 104/787 కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీని పరిశీలించారు. గేజ్‌వాల్‌ను పరిశీలించి సరిహద్దులోని ఇన్‌ఫ్లో విషయాలపై ఆరా తీశారు. సరిహద్దులో హెచ్చుతగ్గులు లేకుండా నీటిని ఇవ్వాలని, ఈ నెలాఖరు వరకు ఇండెంట్ ఎక్కువ స్థాయిలో పెంచకుండా ఇవ్వాలని కర్ణాటక సెక్షన్ ఆఫీసర్ భక్తవత్సలతో అన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం తుంగభద్ర జలాశయం నుంచి ఆంధ్రా సరిహద్దులోని హెచ్చెల్సీకి 768 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. కాలువ పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు నీటి పరిమాణాన్ని పెంచుకుంటూ పోతామని ఎస్‌ఈ అన్నారు. ఒక్కటి రెండు రోజుల్లో వెయ్యి క్యూసెక్కులు, ఆ తర్వాత 1,300 క్యూసెక్కుల నీటిని డ్రా చేసుకోనున్నట్లు వెల్లడించారు. ఆగస్ట్ 15వ తేదీనాటికి 1,800 క్యూసెక్కుల నీరు తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి అవసరం కోసం నీటిని స్టోరేజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఎంపీఆర్, పీఏబీఆర్‌లో 4.45 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం అనంతరం ఆయకట్టుకు నీటిని అందిస్తామని, ఆగస్టు రెండో వారంలో నీటిని ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం హెచ్చెల్సీకి సంబంధించి 25 పనులకుగాను రూ.2.92 కోట్లు మంజూరు అయిందని తెలిపారు. అత్యవసర పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. నీటిపారుదలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం 1వ డిస్ట్రిబ్యూటరీ దగ్గర జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రమణారెడ్డి, డీఈఈ మద్దిలేటి, జేఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

**తుంగభద్రకు పోటెత్తిన వరద**

తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. మొత్తం 32 క్రస్ట్ గేట్ల (20 గేట్లు 2.5 అడుగులు, మరో 12 గేట్లు 2 అడుగుల మేర)ను ఎత్తి దిగువకు నీరు వదిలారు. ఇన్‌ఫ్లో 1,05,378 క్యూసెక్కులు నమోదైంది. డ్యాం నుంచి 1,07,096 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 8,952 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రానికి 1631.96 అడుగులతో 101.617 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి.. మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు.



విద్యుద్దీపాల వెలుగులో తుంగభద్ర జలాశయం

# చట్టం.. జేసీ చుట్టం!

- అల్లర్ల కేసుల్లో నిందితులపై చర్యలు నిల్
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



తాడిపత్రిలో అల్లర్లు జరిగిన సమయంలో జేసీ ఇంటి వద్ద పోలీసుల పహారా (ఫైల్)

**తాడిపత్రిటౌన్:** చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అయితే తాడిపత్రిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. చట్టం.. జేసీకి చుట్టం అన్న రీతిలో వ్యవహరిస్తోంది. కళ్లెదుటే నిందితులు కనిపిస్తున్నా పోలీసులు అరెస్టు చేయకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. అసలు విషయానికి వస్తే... సార్వత్రిక ఎన్నికల అనంతరం తాడిపత్రిలో రెండు రోజుల పాటు ఇరు వర్గాల గొడవలు, అల్లర్ల ఘటనలకు సంబంధించి పోలీసులు ఏడు కేసుల్లో దాదాపు 520 మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఇందులో 163 మందిని (టీడీపీకి చెందిన వారు 81 మంది, వైఎస్సార్‌సీపీకి చెందిన వారు 82 మంది) అరెస్టు చేశారు. ఆ సమయంలో మిగిలిన నిందితుల కోసం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు జల్లెడ పట్టడంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామాలు వదిలి బయటప్రాంతాల్లో తలదాచుకున్నారు. గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయి బిక్కుబిక్కు మంటూ గడిపాయి. పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల నాయకుల ఇళ్ల వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి పట్టణ వాసులు సైతం ఆ ప్రాంతానికి వెళ్లేందుకు వీలు లేకుండా రహదారులనే దిగ్బంధించిన సంఘటనను ఎవ్వరూ మరచిపోలేరు.

**పోలీసుల తీరు వివాదాస్పదం**

అల్లర్లు, గొడవల కేసుల్లో నిందితులుగా ఉండి కనిపించకుండా పోయిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొంతమంది ఎన్నికల ఫలితాల అనంతరం కళ్లెదుటే తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తమ మాట వినని పోలీసులను బదిలీలు చేయిస్తారని, వీఆర్‌కు పంపుతారేమోనని పోలీసులే టీడీపీ నాయకులను చూసి జంకుతున్నారు. నిందితులను చూసి కూడా చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇదే విషయమై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మీడియా సాక్షిగా చెబుతున్నా పోలీసులు ఏమాత్రమూ స్పందించడం లేదు. గత బుధవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట తలపెట్టిన ధర్నాకు అల్లర్ల కేసుల్లో ఉన్న నిందితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్న విషయం తాడిపత్రిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.




## క్లుప్తంగా

### బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన బీటెక్ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-23) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లలిత కుమారి, విభాగాధిపతులు డాక్టర్ మమత, ప్రొఫెసర్ భువనవిజయ, డాక్టర్ భారతి, డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ రామశేఖర్ రెడ్డి, డాక్టర్ దిలీప్, అజిత పాల్గొన్నారు.

### 'నేతన్న నేస్తం' అమలు చేయాలి

- చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రుషింగప్ప డిమాండ్



చేనేత జౌళి శాఖ ఏడీ అప్పాజీకి వినతిపత్రం ఇస్తున్న రుషింగప్ప, తదితరులు

అనంతపురం అర్బన్: చేనేత కార్మికుల సంక్షేమానికి గత జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రుషింగప్ప డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా.. ఏటా ఆగస్టులో చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నల బ్యాంక్ ఖాతాల్లోకి జగన్ సర్కార్ రూ.24 వేలు జమ చేస్తూ వచ్చిందని గుర్తు చేశారు. అదే తరహాలో నేత కార్మికుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.24 వేలు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ చేనేత జౌళి శాఖ ఏడీ అప్పాజీకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

### అటవీశాఖలో ప్రమోషన్లు

అనంతపురం సెంట్రల్: అటవీశాఖలో పనిచేస్తున్న ముగ్గురు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాయలచెరువు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మంజులవాణిని పెనుకొండ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా, కదిరి రేంజ్‌లోని చారుపల్లి అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ రేణుకను చామలగొంది బీట్ ఆఫీసర్‌గా, శెట్టూరు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ తిమ్మక్కను అక్కడే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సమష్టి కృషితోనే సత్ఫలితాలు

అనంతపురం: శాంతి భద్రతల పరిరక్షణలో సత్ఫలితాలు రావాలంటే అందరి కృషి ఉండాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. ఏఆర్ పోలీసులు, హోంగార్డులు శుక్రవారం నిర్వహించిన పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం మాట్లాడారు. జిల్లా ఏఆర్ పోలీసులకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. 'మనమంతా ఒకే కుటుంబం.. మీరు, నేను వేరు కాదు' అని పేర్కొన్నారు. యూనిఫాం సర్వీస్‌లో ఏఆర్, హోంగార్డులు, సివిల్ పోలీసులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రిజినర్స్ ఎస్కార్ట్, గార్డు విధులతో మొదలుకుని అన్ని రకాల విధులు అంకితభావంతో నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. పని ఒత్తిడి తగ్గించేందుకుఅందరికీ సమాన విధులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యం మెరుగుదలకు,





మార్చ్‌ఫాస్ట్‌లో ఏఆర్ పోలీసులు, గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

రోజూ గ్రౌండ్ ప్రాక్టీస్ వదలకూడదన్నారు. అనంతరం ఏఆర్, హోంగార్డులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐ మధు, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, జిల్లా సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

**పోలీసు సంక్షేమానికి కృషి**

పోలీసు సిబ్బంది, కుటుంబసభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని, వారి అభ్యున్నతికి అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. జిల్లా పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. మొత్తం 45 మంది పోలీసు సిబ్బంది వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు సమర్పించారు. పరిశీలించిన అనంతరం సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఇందిర, సీసీ ఆంజనేయప్రసాద్, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ శంకర్, సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యుత్ బిల్లులు ఇలా చెల్లించండి

మీ కోసం

అనంతపురం టౌన్: విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక విధానానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. తాజాగా విద్యుత్ బిల్లులను నేరుగా విద్యుత్ సంస్థ డిస్కమ్‌లకు చేరేలా ప్రత్యేక యాప్‌ను ఏపీఎస్పీడీఎల్ రూపొందించింది. దీంతో చాలా మంది విద్యుత్ వినియోగదారులకు బిల్లులు ఆన్‌లైన్‌లో ఎలా చెల్లించాలో తెలియక విద్యుత్ బిల్లులు కట్టేందుకు కౌంటర్ల వద్ద బారులు తీరుతన్నారు.

**చెల్లింపులు సులువే..**

- ముందుగా మన స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఫోన్ బిల్లు చెల్లించవచ్చు.
- క్రోమ్ బ్రౌజర్‌ను ఓపెన్ చేసి https://www.apspdcl.in/digital&payment.jspవెబ్‌సైట్‌లోకి వెళితే బిల్ డెస్క్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేసి సర్వీస్ నంబర్ నమోదు చేసి, దాని కింద క్యాప్చర్ నంబర్ టైప్ చేసి ఎంటర్ చేయగానే మన విద్యుత్ బిల్లు కనిపిస్తుంది. దీనిని నిర్ధారించుకున్న తర్వాత సబ్‌మిట్ కొడితే వెంటనే ఫోన్ పే, గూగుల్‌పే ఆప్షన్‌లు కనిపిస్తాయి. వీటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకుంటే సంబంధిత యాప్‌లో బిల్లు కనిపిస్తుంది. అక్కడ నగదు బదిలీకి సంబంధించిన పాస్‌వర్డ్ టైప్ చేసి ఒకే చేస్తే వెంటనే పే మెంట్ సక్సెస్ అవుతుంది. ఈ పేమెంట్ రసీదును పీడీఎఫ్‌లో డౌన్‌లోడు చేసి పెట్టుకోవచ్చు.

# బాలికలతో యువకుడి అసభ్య ప్రవర్తన

గార్లదిన్నె: స్థానిక పెనకచెర్ల డ్యాం రోడ్డులో రైల్వే గేట్ సమీపంలో నిర్వహిస్తున్న క్రిష్టియన్ బాలికల హాస్టల్‌లో కొన్ని రోజులుగా ఓ యువకుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... మర్తాడుకు చెందిన సయ్యద్ వలి తన స్వగ్రామంతో పాటు కృష్ణాపురంలోనూ రెండు చర్చిలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో క్రిష్టియన్ సంస్థల నుంచి నిధులు అందిపుచ్చుకుంటూ వస్తున్న ఆయన 12 ఏళ్ల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా మిస్పా గ్రేస్ హోప్ పేరుతో క్రిష్టియన్ బాలికల హాస్టల్ ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో తల్లిదండ్రులు ఉండి పిల్లలను చదివించలేని నిరుపేద బాలికల ప్రవేశాలు కల్పించి గార్లదిన్నెలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకూ చదివిస్తున్నారు. ప్రస్తుతం ఈ హాస్టల్లో విడపనకల్లు, ఉరవకొండ, బుక్కరాయసముద్రం మండలాలకు చెందిన పది మంది బాలికలు వసతి పొందుతున్నారు. ఈ క్రమంలో డిగ్రీ వరకు చదువుకున్న సయ్యద్ వలి కుమారుడు నూర్‌బాషా... హాస్టల్‌లో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తన లైంగిక వాంఛ తీర్చాలంటూ వేధింపులకు గురిచేస్తూ వచ్చాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తమ క్లాస్ టీచర్‌తో చెప్పుకుని బాధపడింది. క్లాస్ టీచర్ ద్వారా సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు వెంటనే హాస్టల్ వద్దకు చేరుకుని సయ్యద్‌వలి, ఆయన భార్య సాలీమాబీ, కుమారుడు నూర్‌బాషాపై దాడి చేశారు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, శింగనమల ఎస్ఐ చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని నూర్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. హాస్టల్లోని మిగిలిన బాలికలను వారివారి ఇళ్లకు పంపేశారు. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. నూర్‌బాషాపై పోక్సో, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ, 75 బీఎన్ఎస్ చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

- ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు



మాట్లాడుతున్న నరసింహరావు

కూడేరు: ఆయిల్ పామ్ సాగుతో రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందవచ్చునని రైతులకు ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు సూచించారు. ఆయిల్ పామ్ సాగుపై కూడేరు మండలం కమ్మూరులో ఎంకే ఆగ్రోటెక్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఆయిల్ పామ్ పంట దిగుబడులకు మార్కెట్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుందన్నారు. కూడేరు, కణేకల్లు, బొమ్మనహాల్, డి.హీరేహాళ్, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఆయిల్ పామ్ సాగును అభివృద్ధి పరిచేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. పంట దిగుబడులకు ప్రభుత్వమే కొనుగోలు ధర ప్రకటిస్తుందని, ఆ ధర ప్రకారం కంపెనీలు నేరుగా రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తాయన్నారు. దిగుబడి కొనుగోలులో ఎవరి మధ్యవర్తిత్వం ఉండదన్నారు. పెట్టుబడి ఖర్చులు పోను ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు నికర ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ పంటకు తెగుళ్ల బెడద తక్కువన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలతో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. పామ్ ఆయిల్ మొక్క నాటిన మొదటి మూడేళ్ల వరకు వేరుశనగ, కంది, మిర్చి, పత్తి, బొప్పాయి వంటి పంటలను అంతర సాగు చేయవచ్చునన్నారు. మొక్కలు నాటిన నాల్గో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకూ దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో కమ్మూరు, అరవకూరు సర్పంచులు చిన్న రంగారెడ్డి, రామాంజనేయులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, మండల ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, ఏఓ విజయ కుమార్, ఎంకే ఆగ్రో ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్, సిబ్బంది చంద్రశేఖర్, మంజు, చెన్నకేశవ్, సుమన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్య



మృతురాలు రమ్యరాధిక

తాడిపత్రి రూరల్: మండలంలోని ఊరుచింతల గ్రామానికి చెందిన రమ్య రాధిక (29) ఆత్మహత్య చేసుకుంది. పెద్దపప్పూరు మండలం చాగల్లుకు చెందిన ఆమెకు 8 ఏళ్ల క్రితం ఊరిచింతల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. కొంత కాలంగా కుటుంబంలో మనస్పర్థలు చెలరేగడంతో తరచూ దంపతులు గొడవ పడేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు, దర్యాప్తు చేపట్టినట్లు అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు.

# తప్పు కప్పిపుచ్చుకునేందుకు పాట్లు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి జిల్లా సమగ్రశిక్ష ఏజీసీడీఓగా పని చేసి రిలీవ్ అయిన ఎం.శివమాధవికి పోస్టింగ్ ఇచ్చే విషయంలో అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉభయ జిల్లాల విద్యాశాఖ అధికారుల అశాస్త్రీయ నిర్ణయాలతో ఓ సామాన్య టీచరు రెన్నెళ్లుగా పడుతున్న ఇబ్బందులపై 'ఉపాధ్యాయురాలి విధులతో రెండు జిల్లాల డీఈఓల చెలగాటం' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యాశాఖ కమిషనర్‌తో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు స్పందించారు. దీంతో ఉలిక్కిపడిన విద్యాశాఖ అధికారులు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ క్రమంలో రీజాయిండరీ తప్పుల తడకగా పంపారు. ఏజీడీసీఓగా పని చేసిన శివమాధవిని జీసీడీఓగా పని చేసిందంటూ స్వయంగా డీఈఓ పేరుతో పంపడం చూస్తుంటే వారి నిర్లక్ష్యం ఎంత మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే శివమాధవికి పోస్టింగ్ ఇవ్వాలంటూ తాము జూన్ 12న ఒకసారి, 27న రెండోసారి పూర్వపు జిల్లా డీఈఓకు లేఖ రాశామంటూ శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి తెలిపారు. మరి రెండుసార్లు లేఖలు పంపినా ఇన్ని రోజులూ ఎందుకు పట్టించుకోలేదో అనంతపురం డీఈఓ వివరణ ఇవ్వలేదు.

**మరో తప్పిదానికి తెర లేపిన అధికారులు**

చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు అనంతపురం డీఈఓ అధికారులు మరో తప్పిదానికి తెరలేపారు. పత్రికలో వెలువడిన కథనంపై ఉన్నతాధికారులు వివరణ అడిగేసరికి పక్కా ప్రణాళికతో ముందు రోజు తేదీ వేసి ఉత్తర్వులు సిద్ధం చేశారు. నేడో... రేపో శివమాధవికి పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వనున్నట్లు డీఈఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు. శుక్రవారం ఉదయం 'సాక్షి'తో డీఈఓ కార్యాలయ అధికారులు మాట్లాడారు. అయితే శుక్రవారం సాయంత్రానికే పాత తేదీ వేసి ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్‌చెరువు జెడ్పీహెచ్ఎస్‌కు శివమాధవిని కేటాయిస్తూ ఈ నెల 25నే (గురువారం) ఉత్తర్వులు ఇచ్చినట్లుగా రికార్డులు సృష్టించారు. ఈ విషయం డీఈఓ కార్యాలయం గడప దాటలేదు. బాధిత టీచరుకు కనీసం ఫోన్‌లో కూడా సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

# మృత్యువులోనూ వీడని పేగుబంధం

- అనారోగ్యంతో తల్లి..
- బెంగతో తనయుడి మృతి

రాయదుర్గం: మృత్యువులోనూ పేగుబంధం వీడలేదు. తల్లి మరణించిందన్న వార్త విన్న కుమారుడు రోదిస్తూ గంటల వ్యవధిలోనూ తనువు చాలించాడు. ఈ హృదయ విదారక సంఘటన రాయదుర్గం మండలం రేకులకుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రేకులకుంటకు చెందిన హరిజన్న లక్ష్మక్క (52), రామాంజినేయులు దంపతులు. కూలి పనులకు వెళ్లి జీవనం సాగించే వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కొంత కాలంగా లక్ష్మక్క క్యాన్సర్‌తో బాధపడుతోంది. తల్లి అంటే కుమారుడు తిప్పేస్వామి (35)కి ఎంతో ప్రేమ. ఆమెను కంటికి రెప్పలా చూసుకునేవాడు. ఈ క్రమంలో ఇతను ఇటీవల టీబీ బారిన పడ్డాడు. భార్య, కుమారుడిని ఎలాగైనా బతికించుకోవాలని రామాంజనేయులు తాపత్రయపడ్డాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. వ్యాధి ముదిరి లక్ష్మక్క గురువారం మధ్యాహ్నం 4 గంటలకు మృతి చెందింది. తల్లి మరణంతో కుంగిపోయాడు. రోదిస్తూనే అర్ధరాత్రి వేళ తనువు చాలించాడు. ఇలా తల్లీ కుమారుడు ఒకరి వెంట ఒకరు గంటల వ్యవధిలోనే మృత్యు ఒడి చేరడం అందరినీ కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ విద్యావతి, సర్పంచ్ ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డిలు వారి నివాసం వద్దకు చేరుకుని మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.

### డీఎస్పీ కార్యాలయ సమీపంలో చోరీ

గుంతకల్లుటౌన్: స్థానిక డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు... గుంతకల్లు డీఎస్పీ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న రాఘవరెడ్డి... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలంలో 108 ఈఎంటీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం ఆయన విధులకు వెళ్లిన సమయంలో భార్య ఇంటికి తాళం వేసి పిల్లలను పిలుచుకుని పాత గుంతకల్లులోని అత్తారింటికి వెళ్లింది. విషయాన్ని గుర్తించిన దుండగులు శుక్రవారం వేకువజామున తాళం బద్దలుగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. వంటగదిలోని కారం డబ్బాలో కవర్‌లో చుట్టి ఉంచిన రూ.3.80 లక్షల నగదు, బీరువాలోని 3.5 తులాల బంగారు నగలను అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం విషయాన్ని గుర్తించిన బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

**GNM (నర్సింగ్) అడ్మిషన్స్**

■On-Line అప్లికేషన్స్ స్టార్ట్. ఇంటర్ ఎనీ గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM (నర్సింగ్) కోర్స్ నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : A.మురళి, 9030661651 అనంతపురం. [A-1291]

**GROUP - II లో నాన్ ఎగ్జిక్యూటివ్**

■P.C మెయింటెనెన్స్ & ట్రబుల్ షూటింగ్ కోర్స్‌కు దరఖాస్తులు : Q:10th, సీట్స్ : 10, లాస్ట్ డేట్ : సెప్టెంబర్ 17, ఎగ్జామ్ డేట్ : అక్టోబర్ 1, ఫీజు : 4500 కేవలం, # సాయి ఇన్స్టిట్యూట్,14/402, కమలానగర్, ATP. సెల్ : 9059723829. [A-1293]

**GOVT. బ్యూటీషియన్ కోర్స్**

■ఫీజు : రూ॥ 12000 రాయితీతో Q: 10th సీట్స్ :6, ఎగ్జామ్ డేట్ : అక్టోబర్ 1, లాస్ట్ డేట్ : సెప్టెంబర్ 17, (ఆన్‌లైన్ అప్లికేషన్), # సాయి ఇన్స్టిట్యూట్, (Aff: APSBTET), # 14/402, కమలానగర్, ATP. సెల్: 9059723829, 7569033379. [A-1294]

**REAL ESTATE**

**RENT / SALE**

■ భాజానగర్, గౌరీ టాకీస్ దగ్గర, నారాయణ కాలేజ్ ప్రక్కన, # 13-3-614లో గల 3 ఫ్లోర్స్ బిల్డింగ్ ఆఫీస్ / గోడౌన్ / కాలేజీలకు బాడుగకు లేదా అమ్మకానికి కలదు & RTC బస్టాండ్ దగ్గర స్వప్న లాడ్జ్ అమ్మకానికి కలదు. 9912028216. [A-762344]

**TO-LET**

■ అనంతపురం విజయనగర్ లా కాలేజ్ లైన్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ ప్రక్కన, హౌసింగ్ బోర్డ్ బిల్డింగ్ (గ్రౌండ్ ఫ్లోర్) బాడుగకు కలదు. సంప్ర ✆ 9912273317. [C-800337]

**PLOT FOR SALE**

■ అనంతపురం టౌన్, కోవూర్ నగర్ లో NH-44 సర్వీస్ రోడ్, బజాజ్ షోరూమ్ వెనుక, హై క్లాస్ ఏరియాలో, 6 సెంట్ల ప్లాటు అమ్మకానికి కలదు. సెంట్ ₹ 25 లక్షలు (బ్రోకర్స్‌కు అవకాశం లేదు). ఆసక్తిగల కొనుగోలుదారులు డైరెక్టుగా సంప్రదించండి: 90004 65655. [A-315]

**PLOT FOR SALE**

అమరావతి దగ్గర 200 నుండి 2250 చ॥ గజాలు అమ్మకం. అమరావతి రాజధాని పరిధిలో విజయవాడ సమీపంలో AP CRDA Approved లే అవుట్‌లో కలదు. ✆ 94906 39993

**PRE LAUNCH OFFER**

■ బెంగళూరు - హైదరాబాద్ NH -44కి కేవలం 18.కి.మీ.దూరంలో, రాప్తాడు దగ్గర, రోడ్ టచ్, 40 ఫీట్ వెడల్పు రోడ్లు, ఎంట్రెన్స్ గేట్, వెంచర్ చుట్టూ ఫ్రీ కాస్ట్ కాంపౌండ్, B.Tరోడ్లు, ప్లాంటేషన్, ఎలెక్ట్రిసిటీ సౌకర్యాలు కలిగిన & Top Civil Advocate చే ఏర్పాటైన ATP Real Estate Associates వారి ATP-2 వెంచర్ నందు. ఫ్రీ లాంచింగ్ ఆఫర్: ₹ 3.3L సెంట్ విలువైన ప్లాటు, సెంట్ కేవలం ₹ 2.8L & ₹ 9.9 L విలువైన 3 సెంట్ల ప్లాటు ₹ 8.4L లకే కలదు. బుకింగ్స్‌కై సంప్ర: Advocate Raj : 9885992991, 9030515722. [A-1295]

**SERVICES**

**శ్రీకృష్ణ జ్యోతిష్యాలయం**

■ మైసూరుకు చెందిన జ్యోతిష్యులైన జనార్ధన జోషి గారు 30 సం॥లుగా మైసూర్ మరియు అనంతపురంలో స్థిరంగా ఉంటున్నారు. మీ రెండు హస్త రేఖలు, జాతకం ఆధారంగా సంపూర్ణ భవిష్యత్తు చెప్పగలరు. ఎటువంటి సమస్యలున్న శాస్త్రీయంగా శాశ్వతంగా. శీఘ్రముగా పరిష్కారం చూపెదరు. వాట్సాప్ + ఫోన్ మూలకంగా కూడా సంప్రదించవచ్చు. సెల్ : 7996591999. [A-313]

**WANTED**

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185366]

■ త్రినేత్ర హోమ్స్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి+ భోజనం. జీతం: 17K.ఫోన్: 8520980099, 8520874499. [H-796258]

■ తాడిపత్రిలో ఫార్మసీలో పనిచేయుటకు ఎక్స్‌పీరియన్స్ ఉన్న వాళ్ళు మరియు ఫ్రెషర్స్ అర్జెంటుగా కావలెను. వివరాలకు సంప్ర : సెల్ : 9000564894. [A-762342]

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Q:10th to Any Degree, Sal:18000/- to 25000/- (Work from available)✆9036133069. [T-778704]

■ NORTH INFRA DEVELOPERS అనంతపురం నందు పనిచేయుటకు RECEPTIONIST (FEMALE) TELECALLER (FEMALE), ACCOUNTANT, MARKETING EXECUTIVES (MALE / FEMALE), MARKETING MANAGERS, MARKETING TEAM LEADERS, OFFICE BOY కావలెను. సెల్ : 9885668299, 9885668499. [A-310]

■ Urgently Wanted Teachers for HINDI, ENGLISH, MATHS, SOCIAL, in 6th to 10th EM Classes. Trained (OR) Un-Trained (Graduate / Post Graduate) also preferable. But 2 years teaching experience must. For staying Gent teachers providing free food & Accommodation. Daily travelling 30KM (TA) extra paying. Contact : 8309913221, 9347986668. [A-1289]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


### టీడీపీ నేతల దుశ్చర్య



పొలం కంచెను ధ్వంసం చేసిన దృశ్యం

బ్రహ్మసముద్రం: మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నాగారెడ్డిపల్లి రామాంజినేయులకు చెందిన వ్యవసాయ భూమికి ఏర్పాటు చేసిన కంచెను గురువారం రాత్రి టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఘటనపై శుక్రవారం ఉదయం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎర్ర కొండాపురం గ్రామ పరిధిలో తనకున్న 23 ఎకరాల భూమి చుట్టూ రామాంజినేయులు కంచె ఏర్పాటు చేశారు. ఆ భూమిపై కన్నేసిన టీడీపీ నాయకులు వెంటేశులు, సందీప్‌కుమార్ ప్రోద్బలంతో తిరుమలేశు, ఆదెప్ప, రాజశేఖర్, నవీన్, అజ్జయ్య, శ్రీనివాసులు, రామలింగ తదితరులు గురువారం రాత్రి కంచెను ధ్వంసం చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఎలుగుబంట్ల హల్‌చల్



పాలవెంకటాపురం సమీపంలో ప్రధాన రహదారిపై ఎలుగుబంటి

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి, పాలవెంకటాపురం గ్రామాల పొలాల్లో దాదాపు రెండు రోజులుగా ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. గురువారం సాయంత్రం పొలంలో పంటకు నీరు పెడుతున్న ఇద్దరు రైతులను ఎలుగుబంట్లు గాయపరిచిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పాలవెంకటాపురం సమీపంలో పొలాల్లో సంచరిస్తున్న ఎలుగు బంట్లను చూసి రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. పంటలకు కాపలా కాస్తున్న రైతులపై దాడి చేసేందుకు ఎలుగుబంట్లు ప్రయత్నించాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సకాలంలో అక్కడకు చేరుకుని ఎలుగుబంట్లను అటవీ ప్రాంతంలోకి తరిమేశారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లో ఆరు బయట నిద్రించేందుకు గ్రామీణులు భయపడుతున్నారు. పగటిపూట పంట పొలాల్లోకి ఒంటరిగా వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

### ఐరన్ ఫ్యాక్టరీలో కార్మికుడి మృతి

గుమ్మఘట్ట (రాయదుర్గం రూరల్): రాయదుర్గం మండలం రాయంపల్లి గ్రామ సమీపంలోని గవిసిద్దేశ్వర స్టీల్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఓ కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన నాగరాజు(65) మూడేళ్లుగా ఐరన్ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం విధులకు హాజరైన ఆయన మరణించినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. నాగరాజు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కాగా, నాగరాజుకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



మృతుడు రాముడు

గుమ్మఘట్ట (రాయదుర్గంరూరల్): రాయదుర్గం మండలం రాతిబావివంక గ్రామానికి చెందిన కౌలు రైతు రాముడు(32) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. గ్రామ సమీపంలో ఆంజనేయులుకు చెందిన ఎకరన్నర పొలాన్ని రాముడు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేపట్టాడు. ఈ క్రమంలో శుక్రవారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన మోటార్ స్విచ్ వేసేందుకు స్టార్టర్ పెట్టెను తెరిచేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# టీసీఎస్‌కు ఎస్ఆర్ఐటీ విద్యార్థులు



టీసీఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

అనంతపురం/బుక్కరాయసముద్రం: ఎస్ఆర్ఐటీ (అటానమస్) కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది తుది సెమిస్టర్‌లో ఉన్న విద్యార్థులకు చేపట్టిన క్యాంపస్ సెలక్షన్లలో ఇద్దరు విద్యార్థులు ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో కూడిన ప్రైమ్ ఆఫీసర్ పోస్టులు దక్కించుకున్నారు. మరో 16 మంది ఏడాదికి రూ.7 లక్షల ప్యాకేజీ, 12 మంది ఏడాదికి రూ.3.36 లక్షల ప్యాకేజీతో నింజా ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. టీసీఎస్ కంపెనీతో ఎస్ఆర్ఐటీకి కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం మేరకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇప్పించి కొలువులు దక్కేలా యాజమాన్యం చర్యలు తీసుకుంది. కొలువులు దక్కించుకున్న 30 మంది విద్యార్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐటీ కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అంకితభావం, కృషి, పట్టుదలకు తార్కణమే మంచి కంపెనీల్లో కొలువులు దక్కడమని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్ టీం సమష్టి కృషితోనే సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు ముందుముందు మంచి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. అత్యధికంగా టీసీఎస్ కంపెనీలో కొలువులు దక్కించుకున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరి రైల్వేస్టేషన్‌లో ఆగనున్న 'వందేభారత్'

గుంతకల్లు: బెంగళూరు-కలబుర్గి మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ యాదగిరి రైల్వేస్టేషన్‌లో నిలుపుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వందేభారత్ రైలు బెంగళూరు జంక్షన్ నుంచి (22232) బయలుదేరి యాదగిరి రైల్వేస్టేషన్‌కు రాత్రి 9.44 గంటకు చేరుతుందని పేర్కొన్నారు. ఇక కలబుర్గి జంక్షన్ నుంచి (22231) యాదగిరి రైల్వేస్టేషన్‌కు ఉదయం 5.54 గంటలకు చేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టండి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగిన నార్కో-ఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు సాగు, రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. గత నెలలో రాయదుర్గం పరిధిలో ఓ గంజాయి కేసు నమోదైందన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న అన్ని రకాల వాహనాలను, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రయాణికులనూ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అవగాహన కల్పించేందుకు జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, బార్లలో పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారి కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో డి-అడిక్షన్ వార్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, డీటీసీ వీర్రాజు, కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎంహెచ్ఓ ఈబీదేవి, డీఈఓ వరలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీలో సమస్యల తిష్ట

- చాలీచాలని పడకలు, ఇరుకు గదులు
- వసతుల కల్పనలో అధికారుల విఫలం



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ మెడిసిన్ (క్యాజువాలిటీ) విభాగంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు చికిత్స అందిస్తున్న వైద్యులు

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో మౌలిక సదుపాయాలు కనిపించడం లేదు. చాలీచాలని పడకలు.. ఇరుకు గదులు, అరకొర సిబ్బందితో ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నతాధికారులు ఎమర్జెన్సీ మెడిసన్‌ను ఏర్పాటు చేశారు. అయితే అందులో సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రౌండ్ ద క్లాక్ విధులు నిర్వర్తించాల్సిన వైద్యులు, సిబ్బంది తక్కువగా ఉండటంతో కేవలం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఉంటున్నారు. దీంతో సాయంత్రం 4 నుంచి ఉదయం 9 గంటల వరకు క్యాజువాలిటీ వైద్యులు, పీజీలు చూసుకోవాల్సి వస్తోంది.

**క్యాజువాలిటీ ఎమర్జెన్సీ మెడిసిన్‌గా మార్పు**

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఈనెల ప్రారంభంలో ఎమర్జెన్సీ మెడిసిన్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. వాస్తవంగా గతంలో ఉన్న క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ వార్డు)ను ఎమర్జెన్సీ మెడిసిన్‌గా మార్చారు. ఈ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈసీజీ, ల్యాబ్ టెక్నీషియన్లు, తదితర సిబ్బంది ఉండాలి. పరికరాలకు సంబంధించి వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, తదితర పరికరాలు పదుల సంఖ్యలో ఉండాలి. కానీ అందులో సగం కూడా పరికరాలు ఇక్కడ లేవు. పడకల విషయానికొస్తే ఆరు ఐసీయూ, నాలుగు రెడ్ జోన్, 5 ఎల్లో జోన్, 6 గ్రీన్ జోన్ పడకలను ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ ఇరుకుగా ఉన్న గదుల్లోనే 20 పడకలు ఏర్పాటు చేశారు. రోగులకు ఊపిరాడని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఉండాలి. సిబ్బంది విషయాకొస్తే ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నూరుల్లా మాత్రమే ఉన్నారు. ఇక పారామెడికల్ తదితర సిబ్బంది అందుబాటులో లేరు.

**గోల్డెన్ అవర్‌లో అందని వైద్యం**

ప్రాణాపాయ స్థితిలో ఉన్న అన్ని రకాల కేసులకు అత్యవసర చికిత్స అందించి.. వారు కాస్త కుదుటపడ్డాక సంబంధిత వార్డులకు రెఫర్ చేయాల్సి ఉంటుంది. గోల్డెన్ అవర్‌లో రోగులకు వైద్యం అందించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. మౌలిక సదుపాయాల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు ముందు చూపు లేకుండా వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అత్యంత కీలకమైన ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో మౌలిక సదుపాయాలు పెంచాలి. రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

### రోగులకు మెరుగైన సేవలు



ప్రస్తుతం ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 20 పడకలున్నాయి. పడకలను పెంచేందుకు ఇంజినీర్లతో సమావేశం ఏర్పాటు చేశాం. ఆస్పత్రికి మంజూరైన పునరుద్ధరణ పనులకు సంబంధించిన నిధులు రూ.3.5 కోట్లతో ఎమర్జెన్సీ మెడిసిన్‌ను విస్తరించేలా చర్యలు తీసుకుంటాం. అంత వరకు ఎమర్జెన్సీ మెడిసిన్‌ను నూతనంగా ఏర్పాటు చేసిన బర్న్స్ వార్డులోకి మార్చుతాం. రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు (సూపరింటెండెంట్, జీజీహెచ్)

## క్లుప్తంగా

### నేడు సర్వసభ్య సమావేశం

**ఆత్మకూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

### కేంద్ర బడ్జెట్ అంశాలపై చర్చ



పవర్‌పాయింట్ ద్వారా అవగాహన కల్పించిన ప్రొఫెసర్లు

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం కేంద్ర బడ్జెట్‌లోని అంశాలపై చర్చించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు, ఆదాయ వ్యయాలకు సంబంధించిన అంశాలపై ఎంబీఏ ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ కృష్ణుడు, డాక్టర్ ఆదినారాయణ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

### రేపు మల్లెల కవితా సంపుటాల ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్:** స్థానిక ఎస్ఎస్‌బీఎన్ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జలస్వప్నం కవి మల్లెల నరసింహామూర్తి రచించిన 'మట్టి తంబూర', 'మాకూ ఒక నది కావాలి' కవితా సంపుటాలను ఆవిష్కరించనున్నారు. సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ సాహితీ కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షవహిస్తారని తెలిపారు. విశిష్ట అతిథిగా కవి, జర్నలిస్టు డాక్టర్ బండారు ప్రసాదమూర్తి, సుప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు లక్ష్మీనరసయ్య అనంత సభకు విచ్చేసి సీమ సమస్యలను, సాహితీ విశిష్టతపై ప్రసంగిస్తారన్నారు. సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

### మొక్కలు నాటి సంరక్షిద్దాం



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న రెవెన్యూ సిబ్బంది

**ఆత్మకూరు:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్వోలు, వీఆర్ఏలతో కలసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు.

### ఆరోగ్యశాఖ ఉద్యోగుల నిరసన

**అనంతపురం మెడికల్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ వైద్య ఆరోగ్యశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే రాధాకృష్ణ అనే వ్యక్తి ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఈనెల 24న గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మినిస్టీరియల్ స్టాఫ్ అధ్యక్షుడు మక్బుల్ అహ్మద్, నాయకులు నాగేంద్ర, దామోదర్, రమణ, నాగరాజు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఎల్ఎల్‌బీ పరీక్షల్లో ఒకరి డీబార్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని సౌకర్యాలపై ఆరా తీశారు. అదే విధంగా న్యాయశాస్త్ర విభాగంలోని తరగతి గదులను పరిశీలించారు. వీసీ వెంట న్యాయశాస్త్ర విభాగాధిపతి (కోఆర్డినేటర్) డాక్టర్ ఎం. శ్రీరాములు ఉన్నారు. ఎస్కేయూ ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒకరిని డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు.

## చట్టాలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థినులతో కలిసి పోస్టర్లు విడుదల చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

**ఆత్మకూరు:** ప్రతి ఒక్కరూ మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసినా.. వాటిని ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్ష పడుతుందని తెలిపారు. ఎవరైనా గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తుంటే 1098, 181 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. మహిళలకు సంబంధించి మహిళా సాధికారత, ఆరోగ్య సంరక్షణ గురించి తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో గృహహింసకు గురవుతున్న మహిళలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. గర్భవతులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి ఆహారం, ఎంత మేరకు తీసుకోవాలన్న విషయాలను, అంగన్‌వాడీ కార్యకర్తలు క్లుప్తంగా వివరించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ లావణ్య, శ్రీవాణి, సచివాలయ సిబ్బంది కీర్తన, షబానా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో కుష్టు నివారణ



మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ అధికారి అనుపమ

**రాప్తాడు:** కుష్టు వ్యాధిపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి. సమష్టి కృషితో కుష్టును నివారిద్దామని జిల్లా లెప్రసీ అధికారి అనుపమ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మరూరు గ్రామంలో జరుగుతున్న లెప్రసీ సర్వేను పర్యవేక్షించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, గ్రామ ప్రజలకు కుష్టుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని మండలా వ్యాప్తంగా వైద్య సిబ్బంది చేపడుతున్నారన్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో ఎండీటీ చికిత్స అందజేయడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి లక్షణాలను తెలుసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పుట్టుకతోనే ఉన్న మచ్చలు, వచ్చిపోయే మచ్చలు, పూర్తిగా తెల్లని మచ్చలు, దురద పెట్టే మచ్చల వల్ల అపోహలు పడరాదని సూచించారు. కుష్టు వ్యాధి సూక్ష్మ క్రిముల ద్వారా వస్తుందని పేర్కొన్నారు. అందుకే చిన్న పిల్లలుగా ఉన్నప్పటి నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుని ఆహారం తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి కుష్టు వ్యాధిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ వైద్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, హెచ్ఈఓ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, ఏఎన్ఎం పావని తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో చిన్న సరిగెత్తు వేడుకలు



రాప్తాడులో కొలువుదీరిన పీర్లు

**రాప్తాడు:** మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రాప్తాడు, హంపాపురం, గాండ్లపర్తి, జి.కొత్తపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో చిన్న సరిగెత్తు వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ చదివింపులు చేశారు. పీర్ల స్వాములకు ప్రత్యేకంగా వెండి గొడుగులు అలంకరించారు. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య పానకాల కుండలను తీసుకొచ్చారు. మొక్కుబడి ఉన్న భక్తులు పెద్ద పెద్ద పూలమాలలను పీర్ల స్వాములకు వేశారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో గుండాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తవ్వారు. ఈనెల 27న పెద్ద సరిగెత్తు, 28న జలధి కార్యక్రమం, 30న జల్తాన్ కార్యక్రమంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని గ్రామ పెద్దలు, ముల్లా సాహెబ్‌లు తెలిపారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు కొనసాగించాలి



టెక్నికల్ ఏఓ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం అగ్రికల్చర్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ గట్టి చర్యలు తీసుకోవాలని విముక్త చిరుతల కచ్చి (వీసీకే) పార్టీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ విజ్ఞప్తి చేశారు. క్రమం తప్పకుండా ఎరువుల అంగళ్లలో తనిఖీలు కొనసాగించాలని కోరుతూ శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ జేడీ కార్యాలయంలో టెక్నికల్ ఏఓ బాలానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. అంగళ్లలో ఎక్కడా ధరల పట్టికలు ఏర్పాటు చేయకుండా రైతులకు అధిక ధరలకు విక్రయాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీకే జిల్లా ప్రధాన కార్యదర్శి కురుగుంట సోమశేఖర్, నాయకులు ఉరవకొండ గోపాల్, రామాంజి, కళ్యాణదుర్గం చెన్నమల్ల, మహలింగ, రాజు, నరసింహులు పాల్గొన్నారు.

## 'ఊరి మధ్యలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయిస్తున్నాడు'



కలెక్టర్‌కు సమస్యను విన్నవించేందుకు వచ్చిన రేకులకుంట గ్రామస్తులు

**అనంతపురం అర్బన్:** 'పంచాయతీ అనుమతి లేకుండా ఒక వ్యక్తి తన ఫ్యాక్టరీ కోసం ఊరి మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయిస్తున్నాడు. ఇలా చేయడం వల్ల ప్రజలకు ప్రమాదకరమని చెప్పినా వినడం లేదు' అని రేకులకుంట గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి పంచాయతీ రేకులకుంట, అమ్మవారిపేట గ్రామ ప్రజలు శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చారు. మాజీ సర్పంచ్ నారాయణ స్వామి, మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సామ్రాట్ మధు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి ఫ్యాక్టరీ కోసం విద్యుత్ లైన్‌ను గ్రామ మధ్య నుంచి ఏర్పాటు చేయిస్తున్నాడన్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయన్నారు. ఇలా ఊరి మధ్య నుంచి విద్యుత్ లైను ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరం, ప్రాణాపాయం అని చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. ఊరి బయటి నుంచి లైన్లు తీసుకెళ్లాలని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు వెంకటేసులు, ఆదెప్ప, నల్లప్ప, ధనుంజయలు, రామాంజనేయులు, ఆదినారాయణ, నాగరాజు, లక్ష్మీనారాయణ, అక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.

### కుమారుడి అదృశ్యంపై కేసు

**అనంతపురం:** అనంతపురంలో నివాసం ఉంటున్న షేక్ దిల్షాద్, షేక్ లతీఫ్ దంపతుల చిన్న కుమారుడు షేక్ సాదిక్ (24) అదృశ్యంపై అనుమానం ఉన్నట్లు శుక్రవారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాలు.. చిన్న కుమారుడు షేక్ సాదిక్‌కు రెండు సంవత్సరాల క్రితం తాడిపత్రి పట్టణానికి చెందిన అమీనాభాను కూతురు హసీనభానుతో వివాహం జరిపించారు. కోడలికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వాళ్ల అత్తగారి ఇంట్లోనే ఇల్లరికం ఉంటున్నాడు. ఈ క్రమంలో అల్లుడికి అత్త బైక్ కొనుగోలు చేసి బహుమతిగా ఇచ్చింది. బైక్‌ను తాడిపత్రిలో కుదవ పెట్టడంతో అత్త అల్లుడిని దూషించింది. దీంతో మూడు నెలల క్రితం సాదిక్ తల్లిదండ్రుల వద్దకే వచ్చి ఉంటున్నాడు. కేరళకు వెళ్లి రెండు రోజుల క్రితం నగరానికి వచ్చిన తల్లిదండ్రులు సాదిక్ కనపడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారుడి అదృశ్యంపై అనుమానాలు ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని త్రీ టౌన్ పోలీసులను కోరారు.

### సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**అనంతపురం రూరల్:** సచివాలయ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ ఉద్యోగుల ప్రభుత్వాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీమిరెడ్డి అంజనరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్ అయిన నెలలకు సంబంధించిన అరియర్స్ చెల్లించాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలు లోనుకాకుండా పారదర్శకంగా బదిలీలు చేపట్టడంతో పాటు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే ఉద్యోగులకు అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల వేధింపులను ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరిచే ఉద్యోగుల కమిటీల్లో గ్రామ, వార్డు సచివాలయ అసోషియేషన్‌ను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు.

### కడపకు రైలు సౌకర్యం కల్పించాలి



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి జన సంఘం నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** అనంతపురం నగరం నుంచి కడపకు వెళ్లేందుకు రైలు సౌకర్యం కల్పించాలని రాయలసీమ రెడ్డి జన సంఘం నాయకులు కోరారు. శుక్రవారం అనంతపురం రైల్వేస్టేషన్ మేనేజర్ అశోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతపురం నుంచి కడపకు రైలులో వెళ్లాలంటే అటు గుత్తికి కాని, ఇటు తాడిపత్రికి కానీ వెళ్లాల్సి వస్తోందన్నారు. రోజూ వివిధ పనులపై వందలాది మంది కడపకు ప్రయాణం చేస్తుంటారని గుర్తు చేశారు. ప్రజలను దృష్టిలో ఉంచుకుని అనంతపురం నుంచి నేరుగా వెళ్లేలా రైలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు, రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి రొద్దం సురేష్ రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు తోపుదుర్తి రామకృష్ణా రెడ్డి, ట్రెజరర్ మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కల్లూరు నాగరత్నం రెడ్డి, పోతిరెడ్డి, వాసుదేవ రెడ్డి, గాజుల వెంకటస్వామి పాల్గొన్నారు.

### సైనికులను ఆదర్శంగా తీసుకోండి



ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్ రెడ్డి సూచించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించడం గర్వకారణంగా ఉందన్నారు. యువత దేశం కోసం పాటుపడాలన్నారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులు అనే నినాదానికి సరైన నిర్వచనాన్ని నిరూపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డాక్టర్ రంగనాథ్, ఎన్ఎస్ఎస్ విష్ణు ప్రియ, బృందా, గవర్నమెంట్ హై స్కూల్ ఎన్‌సీసీ నాగేంద్ర, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర రావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, గొల్ల ఈశ్వరయ్య, సంజీవ కుమార్, జంగం శెట్టి సురేష్ ,మహమ్మద్ గౌస్, హుస్సేన్, తలమర్ల కృష్ణ పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**అనంతపురం టవర్‌క్లాక్:** ఎన్నో ఏళ్ల నుంచి మాదిగలు పోరాటం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు అన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి నూతన కమిటీలు వేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనగా నక్క ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడిగా నరసింహుడును ఏకగీవంగా ఎన్నుకున్నామన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ ఎమ్మెల్యేలకు కృతజ్ఞత యాత్ర కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ముత్యాలు, మల్లేష్, నాగరాజు, ఆదిశేషు, రామాంజి, ఆదెప్ప, రామూర్తి, సరస్వతి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బీబీ ఫాతిమా జాతర



అలంకరణలో మౌలాలి పీర్లు



బీబీ ఫాతిమాను దర్శించుకుంటున్న భక్తులు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



రెవెన్యూ కాలనీలో పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం



అలంకరణలో హజరత్ దూద్ పిరవలి పీర్లు

నగరంలో బీబీ ఫాతిమా పీర్ల జాతర సందర్భంగా శుక్రవారం ఐదో రోడ్డు సందడిగా మారింది. మకానం వద్ద భక్తులు సాయంత్రం నుంచి రాత్రి వరకు చక్కెర చదివింపులు చేయించారు. అంతకుముందు నగర వీధుల్లో పీర్లను ఊరేగించారు. మకానం వద్ద అమ్మవారికి నిత్యపూజలు చేపట్టారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. శనివారం జరిగే పెద్ద సరిగెత్తు వేడుకలకు జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలివస్తారన్నారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం, పీర్ల జలధి నిర్వహిస్తామని తెలిపారు.

– అనంతపురం కల్చరల్:

